క్లుప్తంగా

ప్రజలకు తాగునీరు

ప్రొద్దుటూరు : 13వ వార్డు కౌన్సిలర్ సికిలిరిగి ఇర్ఫాన్ బాషా తన సొంత ఖర్చుతో బుధవారం ప్రజలకు తాగునీటిని అందించారు. మెయిన్‌లైన్ పైపులైన్ పనుల కారణంగా మున్సిపల్ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో కౌన్సిలర్ సొంత డబ్బు వెచ్చించి వాటర్ ట్యాంకుల ద్వారా మినరల్ వాటర్‌ను అందించారు. దీంతో కౌన్సిలర్‌ను ప్రజలను అభినందించారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి బుధవారం ఆర్‌కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా న్యాయవాది సీవీ సురేష్ మాట్లాడుతూ ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారు జీవనోపాధి కోసం కువైట్, ఇతర దేశాల్లో వెళ్లి జీవనం సాగిస్తూ వచ్చిన ఆదాయంలో కొంత భాగం సేవకు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ నిర్వాహకుడు సుబ్బరాయుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విష్ణు వర్దన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల : దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మార్కారెడ్డి సూచించారు. బుధవారం ఆయన గ్రంథాలయంలో మాట్లాడుతూ పట్టణంలో చక్కని లైబ్రరీ ఉందని, దాన్ని చాలామంది వినియోగించుకోవడం లేదన్నారు. సెల్‌ఫోన్‌తో చాలామంది కాలక్షేపం చేస్తున్నారని, పుస్తక పఠనం వల్ల అత్యధిక ప్రయోజనం ఉందన్నారు. చరిత్ర గురించి, పురాణాలు, సాహిత్యం గురించి, దేశనాయకులు, సమాజ సేవకుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కమిటీ సభ్యులు ఖాసింవలి, దాదాపీర్, లైబ్రేరియన్ ఆఫ్రిది పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఎక్కువ ఆదాయానికి కృషి చేసిన డ్రైవర్లను, కండక్టర్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. బుధవారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో కండక్టర్లు ఏఎస్ రాయుడు, ఎస్.నాయబ్‌తోపాటు డ్రైవర్లు హుస్సేన్, ఎస్ఎన్ రెడ్డిలకు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి ప్రశంసాపత్రాలు అందించారు. అలాగే ప్రొద్దుటూరు - ఆళ్లగడ్డ రూట్‌లో శ్రీనివాసరెడ్డి, జయరామిరెడ్డి, భాస్కర్‌లకు గిఫ్ట్ స్కీం ద్వారా బహుమతులు అందించారు.

దేవాలయాలకు సీజీఎఫ్ నిధులు మంజూరు

బ్రహ్మంగారిమఠం : గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకోసం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి దేవాదాయ ధర్మాదాయశాఖ ద్వారా రూ.1.46 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం బి.మఠంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ మద్దిరెడ్డిపల్లెలో సీతారాముల దేవాలయంకు రూ.50 లక్షలు, పలుగురాళ్ళపల్లె పంచాయతీ కొత్తపల్లె రామభజన మందిరంకు రూ.40 లక్షలు, మైదుకూరు మండలం సుంకులగారిపల్లెలో అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నిర్మాణంకు రూ.40 లక్షలు నిధులు ఎమ్మెల్యే కృషివల్ల మంజూరు అయ్యాయన్నారు. ఆయాదేవాలయా పరిధిలోని గ్రామాల ప్రజలు ఎంసీ నిధులు చెల్లించడంతో ఎండోమెంటు సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించారన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ పవన్ ఆగ్రో సెంటర్, శ్రీ విష్ణుట్రేడర్స్ ఎరువుల దుకాణాలను బుధవారం కడప విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కోరమాండల్ యూరియా ఎమ్మార్పీ ధర కంటే అమ్ముతున్నారని, రెండు దుకాణాల్లో ఎరువులను సీజ్ చేసి మండల వ్యవసాయాధికారి స్వాధీనం చేశారు. 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీ పవన్ ఆగ్రో సెంటర్‌లో 7.650 మెట్రిక్ టన్నులు, శ్రీ విష్ణు ట్రేడర్స్‌లో 3.375 మెట్రిక్ టన్నులు కోరమాండల్ యూరియా సీజ్ చేసినట్లు విజిలెన్ అధికారి ఈదురుబాషా తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బాల గంగాధరరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీనివాసులు, క్వాలిటీకంట్రోల్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ షరీఫ్, హెడ్‌కానిస్టేబుల్ జనార్దనరావు, రంతు బాష పాల్గొన్నారు.

లోకరక్షకీ.. పాహిమాం

దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాలలో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. పలు ఆలయాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్


ప్రొద్దుటూరు కల్చరల్ : సత్యనారాయణ ఆలయంలో కామాక్షిదేవి అలంకారం


ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణాలయంలో నరసింహావతారం


ప్రొద్దుటూరు కల్చరల్ : ముక్తిరామ లింగేశ్వర ఆలయంలో గజలక్ష్మీదేవి


బద్వేలు అర్బన్ : జగన్మోహినీదేవి అలంకారం


పోరుమామిళ్ల: అమ్మవారిశాలలో శ్రీ కామాక్షిదేవి అలంకారం


ఖాజీపేట : గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


దువ్వూరు : శ్రీధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


బి.మఠంలో అన్నపూర్ణేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు


ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవి


అమ్మవారి శాలలలో ఏర్పాటు చేసిన సెట్టింగ్


ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవాలయంలో సంతానలక్ష్మీ అలంకారం


బద్వేలు అర్బన్ : అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు


పోరుమామిళ్ల : శ్రీ కృష్ణావతార అలంకారం

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికి వైద్యం

కాశినాయన : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటింటికి వైద్యసేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఎస్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగనపల్లె విలేజ్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలోనే మీ గ్రామ సచివాలయాల్లోనే ప్రత్యేక వైద్యులతో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార కార్యక్రమంలో పాల్గొని గర్భవతులకు, బాలింతలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, ఎంపీడీఓ మైథిలి, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, స్థానిక సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రాములమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జేసీ ఆకస్మిక తనిఖీ

గోపవరం : మండలంలోని రాచాయపేటలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జేసీ గణేష్‌కుమార్ బద్వేలు ఆర్డీఓ ఆకులవెంకటరమణతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోగులకు సంబంధించి రిజిస్ట్రేషన్ నమోదు, ఓపీ కేంద్రాలు, మందుల పంపిణీ, సాధారణ టెస్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. డాక్టర్లకు, సిబ్బంది రోగులకు అందించాల్సిన సేవల పట్ల పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావడం, వారికి సరిపడ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. సురక్షకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందని జేసీ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్‌ను జేసీ పరిశీలించారు. శిబిరంలో దాదాపు 400 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళి, సర్పంచ్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పుల్లయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రవిచంద్రారెడ్డి, హరికృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గోపవరం: రాచాయపేట శిబిరంలో సూచనలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా వైద్య సేవలు

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు వైద్యానికి ఇబ్బంది పడకూడదని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల సచివాలయం-1 వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నాగార్జునరెడ్డి సందర్శించి, జరుగుతున్న పరీక్షలు, చికిత్స, వైద్య సేవలు పరిశీలించారు. జగనన్న కిట్లు పంపిణీ చేశారు. శిబిరంలో 350 మందికి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీఎం బాషా, కోఆప్షన్ మెంబర్ అల్లా, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, పార్టీ నాయకులు హబీబ్, ఓబయ్య, సుబ్బారావు, ఎంపీడీఓ వరప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రజల వద్దకే ఖరీదైన వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీఓ కుళ్లాయమ్మ తెలిపారు. మండల పరిధిలోని చౌడూరు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చౌడూరుతో పాటు కాకిరేనిపల్లె, రంగసాయాపురం గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వైద్య శిబిరంలో సుమారు 417 మంది ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు హనీఫ్‌బాబా, ఇలియరాణి, శ్రీకాంత్, షేక్ జరీనా, హుసేన్‌బాషా, అప్తాల్మిక్ అసిస్టెంట్ సునీల్‌బాబు వైద్య సేవలను అందించారు. మందులను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, చౌడూరు సర్పంచ్ చంద్రుడు, ఉపసర్పంచ్ పల్లా లక్ష్మినారాయణరెడ్డి, కాకిరేనిపల్లె సర్పంచ్ ఉండేల గురులక్ష్మి, ఉండేల కృష్ణారెడ్డి, ఏఓ బాలయ్య పాల్గొన్నారు.


ఖాజీపేట : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలు

ప్రొద్దుటూరు : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరంలాంటిదని జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్ర తెలిపారు. మండల పరిధిలోని చౌడూరు గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర, మాజీ సర్పంచ్ పల్లా లక్ష్మీనారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

రాజుపాళెం : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి, సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా వెంకటసుబ్బా రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలోని బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు చికిత్సలు, పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, సర్పంచ్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోనా రఘురామిరెడ్డి, ఇమ్మారెడ్డి నరసింహారెడ్డి, దస్తగిరి, అశోక్ రెడ్డి, ముడియం శేఖర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, ఎంపీడీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ ఇందిరా రాణి, ఈఓఆర్డీ షాకీర్ ఆలీఖాన్, డాక్టర్లు మంజుల, నిఖిత పాల్గొన్నారు.

ఖాజీపేటలో..

ఖాజీపేట : ఖాజీపేట-2 పరిధి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మైదుకూరు నియోజవకర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజల మంచికోరే సీఎం జగన్‌ను తిరిగి ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, ఉపమండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, బండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నాగిశెట్టిపల్లె పంచాయతీ ఎస్.గొల్లపల్లెలో గురువారం ఉదయం 8 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం ఉంటుందని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

చాపాడులో..

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్షుమయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, సర్పంచ్ ఎల్లారెడ్డి, ఎంపీటీసీ సావిత్రమ్మ, మండల అధికారు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్లు

చాపాడు : కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన పథకం 2.0 ద్వారా మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు స్థానిక దిలిప్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చాపాటి రామసుధారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 75 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉజ్వల పథకం ద్వారా అందజేయనుందని, 18 ఏళ్లు పైబడిన రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలని, ఇప్పటి వరకూ ఎలాంటి గ్యాస్ కనెక్షన్ ఉండరాదన్నారు. ఎస్సీ, ఎస్టీలు కుల ధృవీకరణ పత్రాలు అందజేయాలని, నెలకు రూ.10వేల ఆదాయం ఉండరాదని, 2.5 ఎకరాల లోపు భూమి ఉండాలని, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించని వారు, ద్విచక్ర వాహనం లేనివారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు చాపాడులోని గ్యాస్ ఏజెన్సీలో స్వయంగా లేదా 08564-278090 నెంబరులో సంప్రదించాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కోరారు.

భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు

మైదుకూరు : తన భార్య కనిపించడంలేదని మైదుకూరులోని వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన వెంకటేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన గుంజా వెంకటేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య కొండమ్మ, రెండేళ్ల వయసున్న కుమార్తె నందిత ఉన్నారు. భార్యభర్తలు తరచుగా గొడవపడేవారు. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వెంకటేష్ మేనత్త ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం వెంకటేష్ బయటకు వచ్చి తిరిగి మేనత్త ఇంటికి వెళ్లగా, ఇంటిలో భార్య కొండమ్మ, కుమార్తె నందిత కనిపించలేదు. ఈ విషయమై వెంకటేష్ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన మంగలి రాజా అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంకటేష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చంద్రమౌళి తెలిపారు.

చోరీల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్


మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : దసరా సెలవుల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. చోరీల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

బుధవారం ఏఎస్పీ మీడియాతో మాట్లాడారు. నవరాత్రుల సందర్భంగా ఇళ్లకు తాళం వేసి దర్శనానికి వెళ్లిన సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేయొచ్చని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. దొంగతనాల నివారణ కోసం పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పని చేసే నిఘా కెమెరాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. అంతేగాక దసరా సెలవుల్లో ఇతర ప్రదేశాలకు వెళ్లేవారు ముందస్తుగా కమాండ్ కంట్రోల్ సెల్ నంబర్ 9121100702కు ఫోన్ చేస్తే వెంటనే వారి ఇళ్లలో నిఘా కెమెరాలను ఉచితంగా అమరుస్తారని చెప్పారు. అవకాశం ఉన్నవారు బంగారు, ఇతరత్రా విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. వీధుల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చోరీలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి 'ఎందుకు ఆంధ్రకు జగన్ కావాలి' సమావేశాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీగోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో గురువారం నుండి మూడు రోజుల పాటు ఎందుకు ఆంధ్రకు జగన్ కావాలి కార్యక్రమంపై బద్వేలు మున్సిపాలిటీ నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జీ.సుందర్‌రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుండి వెంకటయ్యనగర్, భావనారాయణనగర్, సురేంద్రనగర్, కుమ్మరికొట్టాలు, తొట్టిగారిపల్లె, గుంతపల్లె, గాంధీనగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ సచివాలయాలకు చెందిన నాయకులతో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. నాలుగు రోజుల క్రితం గుంటూరులో జరిగిన 4వ రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మైదుకూరు హైస్కూల్‌కు చెందిన ఆకాష్, చరణ్‌లు మూడో స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా తెనాలిలో జరిగిన 19వ జంప్‌రోప్ జూనియర్, సీనియర్ ఫెడరేషన్ కప్‌లో మహమ్మద్‌బాషా రజత పతకం సాధించాడు. వీరు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. టెన్నిస్ బాల్‌క్రికెట్, జంప్ రోప్ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ రమాదేవి, ఉపాధ్యాయులు ఎల్.సూర్యనారాయణరెడ్డి తదితరులు అభినందించారు.

పరామర్శ

అట్లూరు : అట్లూరు ఎస్సీకాలనీకి చెందిన చిన్న సుబ్బారాయుడు (50) మృతికి బుధవారం కడప, అన్నమయ్య జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హనుమంతు నివాళి అర్పించారు. కటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యేను విమర్శించినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించిన వారిపై చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా నేతలు కోరారు. వారు బుధవారం స్థానిక ఏఎస్పీ ప్రేరణాకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పదే పదే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారన్నారు. ఆయన కుటుంబ విషయాలను ప్రెస్‌మీట్‌లలో చెబుతున్నారన్నారు. అలాగే అసాంఘిక కార్యక్రమాలను ఎమ్మెల్యేకు అంటగట్టడంతోపాటు ప్రొద్దుటూరు ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడుతున్నారన్నారు. ఏఎస్పీని కలిసిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, జేడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఏఎస్పీ ప్రేరణాకుమార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

సమీకృత వ్యవసాయంతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ వీరయ్య

అట్లూరు: సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టరు ఎ.వీరయ్య పేర్కొన్నారు. బద్వేలు పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో బుధవారం వాటర్‌షెడ్ రైతుల ప్రయోజనార్థం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వర్షాధారంతో సమీకృత వ్యవసాయం వలన రెండు పంటలు పండించుకుని ఆదాయాన్ని పెంపొందించు కోవచ్చన్నారు. అలాగే జిల్లాకు అనువైన సమీకృత పద్ధతులు, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టరు చైతన్య మాట్లాడుతూ భూసార పరీక్షల ఆవశ్యకత, ఉపయోగాలు, వివిధ సేంద్రీయ ఎరువుల తయారీ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, బద్వేలు వాటర్‌షెడ్ అధికారి బి.వేణుగోపాల్ రెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.